సాక్షి చిత్తూరు

ఆదివారం । 22 । డిసెంబర్ । 2024



ఆర్నెళ్లకే మార్పు మొదలైంది

ఆర్నెళ్లకే కూటమి ప్రభుత్వ పాలనను చూసిన జనంలో అప్పుడే మార్పు మొదలైందని మాజీ మంత్రి రోజా ఆరోపించారు. - 8లో



రోడ్డు నియమాలు పాటించండి

వాహనదారులు తప్పనిసరిగా రోడ్డు భద్రతా నియమాలు పాటించాలని జేటీసీ కృష్ణవేణి ఆదేశించారు. - 8లో



పంటలపై ఏనుగుల దాడులు

పెద్దపంజాణి మండలంలో ఏనుగుల దాడుల్లో చేతికొచ్చిన పంటలు నాశనమై రైతులకు తీరని నష్టం వాటిల్లుతోంది. - 8లో

న్యూస్‌రీల్

డీఎంహెచ్‌ఓగా సుధారాణి

చిత్తూరు రూరల్ (కాణిపాకం): చిత్తూరు జిల్లా డీఎంఅండ్‌హెచ్‌ఓగా సుధారాణిని నియమిస్తూ శనివారం రాష్ట్రప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఈమె తిరుపతి జిల్లా చంద్రగిరి అడిషనల్ డీఎంహెచ్‌ఓగా పనిచేస్తున్నారు. ఇక్కడ డీఎంహెచ్‌ఓగా పనిచేస్తున్న ప్రభావతిదేవిని అల్లూరి సీతారామరాజు జిల్లా పాడేరుకు అడిషనల్ డీఎంహెచ్‌ఓగా బదిలీ చేశారు. కాగా వీరు త్వరలో బాధ్యతలు చేపట్టనున్నారు.

నిత్యాన్నదానానికి రూ.లక్ష విరాళం



విరాళం అందజేస్తున్న దాత

కాణిపాకం:కాణిపాకం శ్రీవరసిద్ధి వినాయక స్వామి దేవస్థానంలోని నిత్యాన్నదానానికి శనివారం ఓ దాత రూ. లక్ష విరాళం అందజేశారు.వైజాగ్‌కు చెందిన దాత వెంకటరమణి..నగదును ఆలయ అధికారులకు అందించగా, వారు ఆమెకు స్వామి దర్శనం, తీర్థ ప్రసాదాలు అందజేశారు.

సప్తగిరి గ్రామీణ బ్యాంకు ప్రారంభం



బ్యాంకు శాఖను ప్రారంభిస్తున్న బ్యాంకు సిబ్బంది

చిత్తూరు రూరల్ (కాణిపాకం):చిత్తూరు నగరంలోని వేలూరు రోడ్డులో శనివారం సప్తగిరి గ్రామీణ బ్యాంకును ప్రారంభించారు. ఇండియన్ బ్యాంకు ఆర్‌బీడీ జీఎం చంద్రశేఖర్ ప్రత్యేక పూజలు చేసి రిబ్బన్ కట్ చేశారు. బ్యాంకు సేవలను సద్వినియోగం చేసుకోవాలని ఆయన పిలుపునిచ్చారు. కార్యక్రమంలో బ్యాంకు చైర్మన్ ఏఎస్ఎన్ ప్రసాద్, జనరల్ మేనేజర్ ప్రభాకరన్, రీజినల్ మేనేజర్ డీఎస్‌వీఆర్ కిషోర్ పట్నాయక్, బ్రాంచ్ మేనేజర్ హరీష్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.


నేడు స్పెల్‌బీ సెమీఫైనల్స్

తిరుపతి ఎడ్యుకేషన్ : సాక్షి మీడియా గ్రూప్ ఆధ్వర్యంలో స్పెల్‌బీ సెమీఫైనల్స్ (మూడవ రౌండ్) పరీక్షను తిరుపతి జీవకోనలోని విశ్వం హైస్కూల్‌లో ఆదివారం ఉదయం 10గంటల నుంచి నాలుగు కేటగిరిలో నిర్వహించనున్నట్లు సాక్షి ఈవెంట్స్ ఇన్‌చార్జ్ చంద్రశేఖర్ తెలిపారు. ఇదివరకు పాఠశాల, జిల్లా స్థాయిలో నిర్వహించిన స్పెల్‌బీ పోటీల్లో ప్రతిభ చూపి సెమీఫైనల్స్‌కు అర్హత సాధించిన తిరుపతి, వైఎస్సార్ కడప, ఎస్‌పీఎస్‌ఆర్ నెల్లూరు జిల్లాల విద్యార్థులు ఈ పరీక్షకు హాజరవ్వాలన్నారు. ఉదయం 10గంటలకు కేటగిరి-1, 11గంటలకు కేటగిరి-2, మధ్యాహ్నం 12గంటలకు కేటగిరి-3, ఒంటి గంటకు కేటగిరి-4 విభాగాల్లో పరీక్ష జరుగుతుందన్నారు. విద్యార్థులు తప్పనిసరిగా వారి స్కూల్ యూనిఫాం, స్కూల్ ఐడీ కార్డుతో పాటు పెన్ను, పెన్సిళ్లు, రైటింగ్ ప్యాడ్‌తో పరీక్ష సమయానికి ముందే చేరుకోవాలని ఆయన సూచించారు.

క్రిస్మస్ హైటీ రేపు

చిత్తూరు కలెక్టరేట్ : క్రిస్మస్ పండుగను పురస్కరించుకుని ఈ నెల 23వ తేదీన అధికారికంగా జిల్లా స్థాయి క్రిస్మస్ హైటీ కార్యక్రమం నిర్వహించనున్నట్లు జిల్లా మైనారిటీ సంక్షేమ శాఖ అధికారి చిన్నారెడ్డి తెలిపారు. శనివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో సోమవారం సాయంత్రం 4 గంటలకు క్రిస్మస్ హైటీ కార్యక్రమం ఉంటుందన్నారు.

సంక్షేమంలో కర్ణుడు.. ప్రజాక్షేత్రంలో అర్జునుడు.. వ్యూహాల్లో చాణుక్యుడు.. పాలనలో దార్శనికుడు..శౌర్యంలో శ్రీరాముడు.. మాట తప్పని.. మడమ తిప్పని ధర్మరాజు.. ప్రజలు మెచ్చిన పాలకుడు.. వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి వెయ్యేళ్లు వర్ధిల్లు అంటూ నినదించారు. శనివారం జిల్లా వ్యాప్తంగా వైఎస్సార్‌కాంగ్రెస్ పార్టీ అధినేత, మాజీ సీఎం జగన్‌మోహన్ రెడ్డి జన్మదిన వేడుకలు అట్టహాసంగా జరిగాయి. ఈ సందర్భంగా అభిమానం.. ఆకాశాన్నంటింది.. అంతటా జయహో జగన్ నినాదాలు హోరెత్తాయి. సేవా కార్యక్రమాలు స్ఫూర్తి చాటాయి. గత ఐదేళ్ల సంక్షేమ పాలనను జనం గుర్తు చేసుకుని నూరేళ్లు జీవించు నాయకుడా అంటూ ఆశీర్వదించారు.



నగరిలో దివంగత నేత వైఎస్సార్‌కు నివాళులర్పిస్తున్న మాజీ మంత్రి ఆర్‌కే రోజా

పేదల పెన్నిధి జగన్

ఘనంగా మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి జన్మదిన వేడుకలు

- జిల్లావ్యాప్తంగా స్ఫూర్తి నింపేలా సేవా కార్యక్రమాలు
- మిన్నంటిన జై జగన్ నినాదం
- గత ఐదేళ్ల వైఎస్సార్‌సీపీ పాలనను గుర్తు చేసుకున్న జనం
- ఆర్నెళ్ల కూటమి ప్రభుత్వ పాలనపై ప్రజల్లో మార్పు

చిత్తూరు కార్పొరేషన్ : వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి జన్మదిన వేడుకలు శనివారం జిల్లా వ్యాప్తంగా ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా ఆయా నియోజకవర్గాల ఇన్‌చార్జ్‌లు, పార్టీ నాయకులు, కార్యకర్తలు పలు సేవా కార్యక్రమాలు నిర్వహించారు. మాజీ సీఎం వైఎస్ జగన్ చిత్రపటాలకు క్షీరాభిషేకం చేసి పుట్టిన రోజు శుభాకాంక్షలు తెలిపారు. ఆయన ఆయురారోగ్యాలతో వర్ధిల్లాలని ఆకాంక్షించారు.

నగరి క్లాక్ టవర్ సెంటర్‌లో..

పేద ప్రజల గుండె ధైర్యం జగనన్న అని పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి, మాజీ మంత్రి ఆర్‌కే రోజా అన్నారు. నగరి మండలం మాంగాడు గ్రామంలో పార్టీ పతాకాన్ని ఎగురవేసి, కేక్ కట్ చేసి, ఒకరినొకరు పంచుకున్నారు. కార్యకర్తలు సంబరాలు చేసుకున్నారు. అనంతరం టవర్‌క్లాక్ సెంటర్‌లో మహానేత వైఎస్సార్ విగ్రహానికి పూలదండ వేసి నివాళులర్పించారు. పేదలకు అన్నదానం చేశారు. ఏరియా ఆస్పత్రిలో బాలింతలకు పండ్లు, పాలు అందజేశారు. ఆమె మాట్లాడుతూ సంక్షేమ సంతకం చేసి ప్రజల ఖాతాల్లోకి నేరుగా నగదు జమచేసిన ఘనత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందన్నారు. కుల, మతాలకు అతీతంగా రామరాజ్య పాలన సాగించారన్నారు. పేదవారికి ఆర్థికంగా భరోసా ఇచ్చి వారి ఉన్నతికి కృషి చేశారని తెలిపారు. పుత్తూరులో మాజీ మంత్రి సోదరుడు కుమారస్వామిరెడ్డి ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. నియోజకవర్గంలో జగనన్న జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. నగరి నియోజకవర్గవ్యాప్తంగా వేడుకలు అట్టహాసంగా నిర్వహించారు. పుత్తూరులో మున్సిపల్ చైర్మన్ హరి, ఎంపీపీ మునివేలు, నింద్రలో ఎంపీపీ దీప, జెడ్పీటీసీ సభ్యులు మల్లీశ్వరి పాల్గొన్నారు.



చిత్తూరులో ప్రభుత్వ ఆస్పత్రిలో బాలింతలకు పండ్లు పంపిణీ చేస్తున్న విజయానందరెడ్డి

- చిత్తూరులో నియోజకవర్గ ఇన్‌చార్జ్ విజయానందరెడ్డి పార్టీ కార్యాలయంలో నాయకులతో కలిసి కేక్ కట్ చేశారు. గిరింపేటలో డిప్యూటీ మేయర్ చంద్రశేఖర్ కేక్ కట్ చేశారు. కట్టమంచిలో మహిళలు కోలాట ప్రదర్శన నిర్వహించారు. ప్రభుత్వ ఆస్పత్రిలో గర్భిణులు, బాలింతలకు పండ్లు పంచిపెట్టారు. ఆయన మాట్లాడుతూ కుప్పంలో జగనన్న జన్మదినం రోజున ప్రభుత్వం ఆంక్షలు పెట్టడం సరికాదన్నారు. కూటమి నాయకుల కక్షసాధింపు ధోరణికి ప్రజలు గుణపాఠం ప్రజలు చెబుతారన్నారు. గుడిపాల, రూరల్ మండలాల్లో నాయకుల ఆధ్వర్యంలో కేక్‌కట్ చేసి అన్నదానం చేశారు. పార్టీ ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



కుప్పంలో కేక్ కట్ చేస్తున్న ఎమ్మెల్సీ భరత్

- కుప్పంలో ఎమ్మెల్సీ భరత్ నాయకులు, కార్యకర్తలతో కలిసి కేక్ కట్ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ దివంగత నేత వైఎస్సార్ తర్వాత ప్రజలకు, బడుగు, బలహీనవర్గాల అభ్యున్నతి కోసం కృషి చేసిన గొప్పనేత జగనన్న అన్నారు. కూటమి ప్రభుత్వం ఎన్నికల హామీలను అమలు చేయకుండా ప్రజలను మోసం చేస్తోందన్నారు.

జగనన్న కటౌట్ చూసినా భయమేనా?

సాక్షి ప్రతినిధి, తిరుపతి : కూటమి నేతలు ఇన్నాళ్లు వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డిని చూస్తే భయపడ్డారు.. ఇప్పుడు వైఎస్ జగన్ కటౌట్‌ని చూసినా భయపడుతున్నారని మాజీ మంత్రి ఆర్కే.రోజా ఎద్దేవా చేశారు. అధికారులను అడ్డం పెట్టుకుని పుట్టిన రోజు వేడుకలను అడ్డుకుంటున్నారన్నారు. తిరుపతిలో వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి జన్మదిన వేడుకల్లో పాల్గొన్న ఆమె కూటమి నేతల తీరుపై తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. వైఎస్సార్‌సీపీ శ్రేణుల ఆస్తులు ధ్వంసం చేసినా.. వేధింపులకు గురిచేసినా వడ్డీతో సహా తిరిగి చెల్లిస్తామని హెచ్చరించారు. కూటమి నేతలు ఓట్ల కోసం.. కాళ్లు, చేతులు పట్టుకున్నా ఫలితం ఉండదని గ్రహించి ఈవీఎంలను ట్యాంపరింగ్ చేసి గెలిచారని విమర్శించారు. అధికార పార్టీపై నెల రోజులకే వ్యతిరేకత మొదలైందన్నారు. జగనన్న నాయకత్వంలో ప్రజల పక్షాన పోరాటం చేద్దామని నాయకులకు పిలుపునిచ్చారు. తాను అవినీతికి పాల్పడ్డానని చెబుతున్న వారికి ఆమె సవాల్ విసిరారు. తాను అవినీతికి పాల్పడి ఉంటే.. ఇప్పుడు అధికారం మీ చేతుల్లోనే ఉందని.. తాను చేసిన తప్పు ఏంటో నిరూపించాలని డిమాండ్ చేశారు. అబద్ధపు హామీలు ఇచ్చి కూటమి అధికారంలోకి వచ్చిందన్నారు. తిరుపతిలో పబ్‌లు పెట్టి రాష్ట్రాన్ని నాశనం చేస్తున్నారని ఆమె ధ్వజమెత్తారు.



వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పుట్టినరోజు వేడుకల్లో మాట్లాడుతున్న మాజీ మంత్రి ఆర్‌కే రోజా



పుంగనూరు: వేడుకల్లో పాల్గొన్న మాజీ ఎంపీ రెడ్డెప్ప

- పుంగనూరులో జరిగిన వేడుకల్లో పాల్గొన్న మాజీ ఎంపీ రెడ్డెప్ప మాట్లాడుతూ ఈవీఎంల గోల్‌మాల్‌తో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిందన్నారు. ప్రభుత్వం నుంచి ఎటువంటి సంక్షేమ పథకాలు ప్రజలకు అందలేదని విమర్శించారు. ఎల్లప్పుడూ ప్రతిపక్షాన్ని వేధించడం పనిగా పెట్టుకున్నారని తెలిపారు. ప్రజలు అన్ని విషయాలను గమనిస్తున్నట్లు చెప్పారు. ఆరు నెలల్లోనే కూటమి పాలనపై ప్రజలు విసుగు చెందారన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ అలీమ్‌బాషా, ఎంపీపీ భాస్కర్‌రెడ్డి, సీమ జిల్లా మైనార్టీ సెల్ ఇన్‌చార్జ్ ఫకృద్దీన్ షరీఫ్ తదితరులు పాల్గొన్నారు.



వి.కోటలో అన్నదానం చేస్తున్న జెడ్పీ చైర్మన్ శ్రీనివాసులు

- పలమనేరు నియోజకవర్గంలోని పలమనేరు, బైరెడ్డిపల్లె, వి.కోట(ఓగు పంచాయతీ)లో మాజీ ఎమ్మెల్యే వెంకటేగౌడ, వి.కోటలో జెడ్పీ చైర్మన్ శ్రీనివాసులు ఆధ్వర్యంలో వేడుకలు నిర్వహించారు. అనంతరం వారు మాట్లాడుతూ ప్రజలకు పారదర్శకమైన పాలనను జగనన్న మాత్రమే అందించారన్నారు. కూటమి ప్రభుత్వంలోని నేతలు దోచుకోవడమే పనిగా పెట్టుకున్నారని విమర్శించారు.



పలమనేరులో అన్నదానం చేస్తున్న వెంకటేగౌడ, నాయకులు



పూతలపట్టులో మాజీ సీఎం జగన్ చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న మాజీ ఎమ్మెల్యే సునీల్‌కుమార్

- పూతలపట్టులో మాజీ ఎమ్మెల్యే సునీల్ ఆధ్వర్యంలో వేడుకలు నిర్వహించారు. బంగారుపాళ్యంలో మాజీ సీఎం జగన్ చిత్రపటానికి పాలాభిషేకం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ప్రతిపక్షంలో ఉన్నప్పటికీ వైఎస్సార్‌సీపీపై ప్రజల ఆదరణ ఏ మాత్రం తగ్గలేదన్నారు. పేద ప్రజల సంక్షేమం కోసం కృషి చేసిన జగనన్న పాలనను ప్రజలు మరిచిపోలేదని చెప్పారు. యాదమరిలో జెడ్పీ వైస్ చైర్మన్ ధనంజయరెడ్డి ఆధ్వర్యంలో సేవా కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు భారీగా పాల్గొన్నారు.

- గంగాధరనెల్లూరు నియోజకవర్గం కేంద్రంలో పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ కృపాలక్ష్మి ఆధ్వర్యంలో వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ వచ్చే ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ గెలుపు ఖాయమన్నారు. నాయకులు, కార్యకర్తలకు తాను అండగా ఉంటానని తెలిపారు. గంగాధర నెల్లూరులో ఎంపీపీ అనిత రెడ్డి ఆధ్వర్యంలో 40 కేజీల భారీ కేక్ కట్ చేసి అన్నదానం చేశారు. అలాగే శ్రీరంగరాజపురంలో వైఎస్సార్, అంబేడ్కర్ అంబేడ్కర్ విగ్రహాలకు, పాలసముద్రంలో వైఎస్సార్ విగ్రహానికి నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు.



జీడీనెల్లూరులో అన్నదానం చేస్తున్న కృపాలక్ష్మి

ఇంటి ముందు లెటర్.. యమడేంజర్



- కొత్తపుంతలు తొక్కుతున్న సైబర్ నేరాలు
- మనకు తెలియకుండా ఇళ్ల ముందు లెటర్లు
- అడ్రస్ తప్పు ఉంది..స్కాన్ చేయండని లెటర్‌పైనే క్యూఆర్‌కోడ్
- పొరపాటున స్కాన్ చేశారా? ఖాతా ఖాళీ

పలమనేరు: ఇప్పటిదాకా స్మార్ట్‌ఫోన్‌లో వాట్సాప్‌కు లింకులు, ఫేస్‌బుక్ హ్యాకింగ్స్, బ్యాంకు అధికారుల పేరిట ఫేక్ కాల్స్, ఓటీపీలు, మన ఫోన్ ఎవరికైనా కాల్ కోసం ఇస్తే దాంట్లో సెట్టింగ్స్ మార్చేయడం, ఫేక్ వెడ్డింగ్ ఇన్విటేషన్స్, ఫోన్ హ్యాకింగ్, ఏటీఎం సెంటర్ల వద్ద మోసాలు, తాజాగా బయటి ప్రాంతాల్లో విద్యనభ్యసిస్తున్న లేదా ఉద్యోగాల చేస్తున్న వారి నంబర్ల ఆధారంగా వారి కుటుంబీకులకు డిజిటల్ అరెస్టులు సర్వసాధారణంగా మారాయి. ఈ సైబర్ నేరాలకు సంబంధించి పోలీసులు, వారు ఇచ్చిన టోల్ ఫ్రీ నంబర్లు సైతం బాధితులను రక్షించలేకపోతున్నాయి. తాజాగా మరోకొత్త మోసం వెలుగులోకి వచ్చింది. దీన్ని ఎలాంటి వారైనా నమ్మి మోసపోవాల్సిందే.



క్యూఆర్ కోడ్‌తో ఇళ్ల ముందు పడేస్తున్న లెటర్లు

మీ ఇంటి ముందు ఓ లెటర్‌ను పడేసి..

ఇంటిముందు ఓ లెటర్ లేదా కొరియర్ ఫామ్ పడి ఉంటుంది. దానిపై డేట్, వేబిల్ నంబరు, కొరియర్ లేదా పార్సిల్ కంపెనీ పేరు ఉంటుంది. అందులోని స్కానర్‌ను స్కాన్ చేసి చేంజ్ యువర్ డెలివరీ డేట్, ఆల్టర్‌నేట్ అడ్రస్ తదితర వివరాలు ఉంటాయి. దీన్ని నమ్మి మనకేమైనా పార్సిల్ లేదా లెటర్, వస్తువులు వచ్చాయేమోనని భావించి మన స్మార్ట్‌ఫోన్ ద్వారా దానిపై ఉన్న క్యూఆర్‌కోడ్‌ను స్కాన్ చేశామో ఇక అంతే సంగతులు. వెంటనే మన ఫోన్ హ్యాకర్ల గుప్పెట్లోకి పోతుంది. మనఫోన్‌లో జరిగే అన్ని లావాదేవీలను హ్యాకర్స్ డార్క్‌నెట్ ద్వారా గమనిస్తుంటారు. ఇందుకోసం పెద్ద నెట్‌వర్క్ ఉంటుంది. చాలామంది సాఫ్ట్‌వేర్లు ఇందులో పనిచేస్తూ మనం సెల్‌లో చేసే పనులను గమనిస్తుంటారు. బహుశా మనం ఫోన్‌పే, గూగుల్‌పే నుంచి ఎవరికైనా డబ్బు పంపి మన పిన్‌ను ఎంటర్ చేశామంటే ఆ పిన్‌ను వారు గుర్తిస్తారు. ఆపై మన ఖాతాలో ఉన్న డబ్బును మనకు తెలియకుండానే కాజేస్తారు. మన సెల్‌కు డబ్బులు కట్ అయినట్లు ఓ ఎస్ఎంఎస్ మాత్రం వస్తుంది. ఆపై మనం ఏమీ చేయాలన్నా మన సెల్ హ్యాకర్ల అదుపులో ఉన్నందున మనం ఏం చేసినా లాభం ఉండదు.

నెల రోజులుగా ఈ మోసాలు..

బెంగళూరులో గత నెల రోజులుగా ఇలాంటి ఫేక్ లెటర్లు ఇంటి ముందు పడి ఉండడం, వాటిని స్మార్ట్‌ఫోన్‌లో స్కాన్ చేసిన వారి ఖాతాల్లో డబ్బు మాయం కావడం ఎక్కువగా జరుగుతోంది. దీంతో ఈ విషయాన్ని కొందరు సోషల్ మీడియాలో ఇప్పుడు వైరల్ చేస్తున్నారు. మెట్రోపాలిటన్ సిటీలో ఇప్పుడు జరుగుతున్న ఇలాంటి సైబర్ మోసాలు మన చెంతకు చేరడం ఎన్నో రోజులు పట్టదు. మన ఇళ్ల వద్ద ఏదైనా స్కానింగ్ ఉన్న లెటర్ వస్తే కాస్త జాగ్రత్తగా ఉండాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

నేడు, రేపు కౌన్సెలింగ్

చిత్తూరు కలెక్టరేట్ : చిత్తూరు, తిరుపతి జిల్లాల్లోని మున్సిపల్, కార్పొరేషన్ పాఠశాలల్లో పనిచేస్తున్న పలు కేడర్ టీచర్లకు ఈ నెల 22, 23 తేదీల్లో ఉద్యోగోన్నతుల కౌన్సెలింగ్ నిర్వహించనున్నట్లు డీఈఓ వరలక్ష్మి తెలిపారు. ఈ మేరకు శనివారం ఆమె విలేకరులతో మాట్లాడారు. చిత్తూరు, తిరుపతి జిల్లాల్లోని మున్సిపల్, కార్పొరేషన్ పాఠశాలల్లో పనిచేస్తున్న స్కూల్ అసిస్టెంట్లకు హెచ్ఎంలుగా, ఎస్జీటీలకు స్కూల్ అసిస్టెంట్లుగా ఉద్యోగోన్నతి కల్పించనున్నట్లు తెలిపారు. ఈ ఉద్యోగోన్నతులకు సంబంధించిన సీనియారిటీ జాబితాలను ఇప్పటికే రెండు జిల్లాల ఎంఈఓలకు పంపినట్లు చెప్పారు. ఆ జాబితాల ప్రకారం అర్హులైన ఆయా కేడర్ల టీచర్లు సంబంధిత తేదీల్లో సర్వీసు పుస్తకం, కుల, విద్యార్హతల ఒరిజనల్ సర్టిఫికెట్లు, డీఎస్సీ అపాయింట్‌మెంట్ ఆర్డర్, ఇప్పటి వరకు బదిలీ అయిన ఆర్డర్ కాపీలతో కౌన్సెలింగ్‌కు హాజరు కావాలన్నారు. ఆదివారం గ్రేడ్-2 హెచ్ఎంలకు, 23న అంటే సోమవారం కార్పొరేషన్ స్కూళ్లకు సంబంధించి స్కూల్ అసిస్టెంట్ బయాలజీ, గణితం, ఫిజిక్స్, సోషల్, ఇంగ్లిష్, మున్సిపల్ పాఠశాలల్లోని గణితం, ఫిజిక్స్ కేడర్ పరిశీలన, కౌన్సెలింగ్ జరుగుతుందన్నారు. జిల్లా కేంద్రంలోని డీఈఓ కార్యాలయంలో నిర్వహించే ఉద్యోగోన్నతుల పరిశీలన, కౌన్సెలింగ్ కార్యక్రమాలకు అర్హులైన టీచర్లు హాజరుకావాలని ఆదేశించారు.

నంది అవార్డుకు ఎంపిక

తిరుపతి సిటీ: మహిళా యూనివర్సిటీ సమీపంలోని పవర్ ఆర్గనైజేషన్ (పీపుల్ ఆర్గనైజేషన్ ఫర్ విమెన్ ఎంపవర్‌మెంట్ ఇన్ రూరల్ సెక్టార్) అధినేత సావిత్రిని తిరుపతి జిల్లా దివ్యాంగుల అసోసియేషన్ నంది అవార్డుకు ఎంపిక చేసింది. ఆమె చేసిన విశిష్ట సేవలకుగానూ అవార్డుకు ఎంపిక చేయడం హర్షణీయమని డ్వాక్రా మహిళలు ఆనందం వ్యక్తం చేశారు. ఆర్గనైజేషన్ ద్వారా ఉచిత టైలరింగ్ కోర్సులను ఏర్పాటు చేసి డ్వాక్రా మహిళలకు స్వయం ఉపాధిని కల్పిస్తున్నారు. పర్యావరణ పరిరక్షణ, గోశాల స్థాపన, ఆధ్యాత్మికత వైపు డ్వాక్రా మహిళలను నడిపించేందుకు రామకోటి పత్రాలను రాయించేందుకు కృషి చేస్తున్నారు.

రెండోసారి నారావారి ప్రారంభోత్సవాలు



పునః ప్రారంభోత్సవానికి ముస్తాబవుతున్న వాటర్‌ప్లాంట్



గతంలో ఏర్పాటు చేసిన శిలాఫలకం

- వి.కోటలో వాటర్ ప్లాంట్, పాత భవనానికి రంగులేసి మరోమారు పునఃప్రారంభానికి ఏర్పాట్లు
- నేడు పునః ప్రారంభించనున్న సీఎం సతీమణి నారా భువనేశ్వరి
- నవ్వుకుంటున్న జనం

వి.కోట:వి.కోట పట్టణంలోని ఉపమార్కెట్ యార్డ్ ప్రాంగణంలో ఏర్పాటు చెసిన రక్షిత మంచి నీటి ప్లాంటును ముఖ్యమంత్రి సతీమణి నారా భువనేశ్వరి ఆది వారం పునఃప్రారంభోత్సవానికి హాజరవుతున్నారు. 2016 సంవత్సరంలో నారా భువనేశ్వరి మార్కెట్ యార్డులో రక్షిత మంచినీటి ప్లాంటును ప్రారంభించి 8 ఏళ్లు గడిచింది. ఇప్పుడు మళ్లీ పాత పనికి కొత్త ప్రారంభం ఏమిటని ప్రజలు నవ్వుకుంటున్నారు. ప్లాంటు పునఃప్రారంభానికి తెలుగు తమ్ముళ్లు, అధికారులు ఏర్పాట్లు పూర్తి చేశారు. గతంలో సుజల హెరిటేజ్ రైతు సంక్షేమ నిధి, వ్యవసాయ మార్కెట్ కమిటీ సౌజన్యంతో నారా భువనేశ్వరి 2016 జనవరిలో ప్రారంభించిన భవనాన్నే మళ్లీ ఇప్పుడు కొత్త రంగులు అద్ది ప్రారంభించేందుకు తెలుగు తమ్ముళ్లు ఆర్భాటం చేస్తున్నారు.

క్లుప్తంగా

పంటలపై ఏనుగుల దాడులు

పెద్దపంజాణి: మండలంలో పంటలపై ఏనుగుల దాడులు కొనసాగుతూనే ఉన్నాయి. గత కొంతకాలంగా పెద్దకాప్పల్లి, నాగిరెడ్డిపల్లి పంచాయతీ పరిధిలోని అటవీ సరిహద్దు గ్రామాల రైతులకు చెందిన పంటలను నాశనం చేస్తున్నాయి. శుక్రవారం రాత్రి పలమనేరు ఫారెస్టు రేంజ్ కీలపట్ల బీటు నుంచి వచ్చిన ఏనుగులు నాగిరెడ్డిపల్లి పంచాయతీ చల్లావారిపల్లి సమీపంలోని పంటలపై విధ్వంసం సృష్టించాయి. గోపి, చెంగ్రాలాయప్ప తదితరులు సాగు చేసిన టమాట పంటను ధ్వంసం చేశాయి. శనివారం ఉదయం పొలాల వద్దకు వెళ్లిన రైతులు పంటను ఏనుగులు తొక్కేయడంతో తీరని నష్టం వాటిల్లిందని తీవ్ర ఆవేదనకు గురయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ చేతికొచ్చిన పంట ఏనుగుల వల్ల నష్టపోతున్నామని కన్నీరు మున్నీరయ్యారు. భారీగా పంట నష్టం జరిగినా అధికారులు మాత్రం నామమాత్రంగా పరిహారం చెల్లిస్తున్నారని వాపోయారు. గజ దాడులకు శాశ్వత పరిష్కారం చూపాలని వారు కోరుతున్నారు. బాధిత రైతుల సమాచారంతో రాయలపేట ఫారెస్టు బీట్ ఆఫీసర్ రవికుమార్ పంట నష్టాన్ని పరిశీలించారు. వివరాలను ఉన్నతాధికారులకు పంపిస్తామన్నారు. ట్రాకర్ల సాయంతో ఏనుగులను అడవిలోకి మళ్లించేందుకు చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు.

రోడ్డు భద్రత పాటించండి

చిత్తూరు రూరల్ (కాణిపాకం): వాహనదారులు రోడ్డు భద్రత నియమాలు పాటించేలా చూడాలని జేటీసీ కృష్ణవేణి ఆదేశించారు. చిత్తూరు నగరంలోని జిల్లా రవాణాశాఖ కార్యాలయాన్ని ఆమె శనివారం సందర్శించారు. ఈ సందర్భంగా కార్యాలయ అధికారులు పుష్పగుచ్ఛం అందించారు. అనంతరం ఆమె అధికారులతో సమీక్ష నిర్వహించారు. రోడ్డు భద్రతా నియమాలు పాటించని వారిపై చర్యలు ఏవని ప్రశ్నల వర్షం కురిపించారు. కచ్చితంగా వాహనదారులు రోడ్డు భద్రతా నియమాలు పాటించేలా చూడాలన్నారు. హెల్మెట్ లేకుండా బండి నడిపితే జరిమానాలు విధించాలన్నారు. అలాగే డ్రైవింగ్ లైసెన్స్ లేకుండా రోడ్డుపై వస్తే చట్టపరమైన చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో డీటీసీ నిరంజన్ రెడ్డి, ఆర్టీఓ సునీల్, ఎంవీఐలు రాజేశ్వరరావు, వాసుదేవారెడ్డి, శివకుమార్, దీపిక, కుసుమ తదితరులు పాల్గొన్నారు.

సారా రహిత రాష్ట్రమే లక్ష్యం



ప్రజలకు అవగాహన కల్పిస్తున్న ఎక్సైజ్ అధికారులు

పుత్తూరు: సారా రహిత రాష్ట్ర ఏర్పాటుకు ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని ఏఈఎస్ వాసుదేవచౌదరి పిలుపునిచ్చారు. శనివారం పుత్తూరు ఎక్సైజ్ స్టేషన్ పరిధిలోని తిరువట్యం గ్రామంలో సారా, గంజాయి, మత్తు పదార్థాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో సారా అనేది లేకుండా చేయడంతో పాటు సారా తయారీకి అలవాటు పడిన వారిలో పరివర్తన తీసుకురావడానికే అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. సారా, గంజాయి వంటి మత్తు పదార్థాలు వినియోగించినా, అమ్మినా కఠిన చర్యలు తప్పవన్నారు. అంతకముందు గ్రామ అటవీ ప్రాంతంలో దాచి ఉంచిన 200 లీటర్ల సారా ఊటను ధ్వంసం చేశారు. కార్యక్రమంలో పుత్తూరు ఎక్సైజ్ సీఐ మురళీమోహన్, ఫారెస్టు సిబ్బంది పాల్గొన్నారు.

ఆర్నెళ్లకే మార్పు మొదలైంది

- గత ఐదేళ్ల పాలనలో అంతా సంక్షేమమే
- సంక్షేమం గాలికొదిలేసిన కూటమి సర్కారు
- టీడీపీని వీడి వైఎస్సార్‌సీపీలోకి నగరి ముఖ్య నేత అయ్యప్పన్
- సుమారు 100 మందితో పార్టీలో చేరిక
- కండువా వేసి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించిన మాజీమంత్రి రోజా



వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీలో చేరిన ఈకే అయ్యప్పన్, అతని అనుచరులతో మాజీ మంత్రి రోజా

నగరి : వైఎస్సార్‌కాంగ్రెస్ పార్టీ అధినేత జగన్‌మోహన్ రెడ్డి జన్మదిన వేడుకలు పెనుమార్పుకు నాంది పలికాయి. ఆర్నెళ్లలోనే కూటమి ప్రభుత్వం ప్రజల విశ్వసనీయతను కోల్పోతోంది. అందుకు నగరి మున్సిపాలిటీ కేవీపీఆర్ పేటలో టీడీపీ ప్రధాన నేత ఈకే అయ్యప్పన్ తన అనుచరులు వందమందితో కలిసి మాజీ మంత్రి ఆర్కే రోజా సమక్షంలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీలో చేరడమే అందుకు సాక్ష్యంగా నిలుస్తోంది. శనివారం కేవీపీఆర్ పేటలోని తన నివాసం వద్ద ఈకే అయ్యప్పన్ భారీ జనం మధ్య మాజీ సీఎం జగన్ జన్మదిన వేడుకలను మాజీ మంత్రి రోజాతో కలిసి జరుపుకున్నారు. అనంతరం ఆమె సమక్షంలో వైఎస్సార్‌సీపీలో చేరారు. ఇకపై వైఎస్ జగన్, రోజా నాయకత్వాన్ని బలపరుస్తామన్నారు. అనంతరం ఆమె అందరికీ వైఎస్సార్‌సీపీ కండువాలు వేసి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఈ ఆర్నెళ్లకే కూటమి పాలన గురించి ప్రజలకు అర్థమైపోయిందని, అన్ని వర్గాల వారిలో వస్తున్న మార్పు స్పష్టంగా కనిపిస్తోందన్నారు. ఈరోజు వైఎస్ జగనన్న జన్మదిన వేడుకలే ఆ మార్పునకు నాంది పలికాయన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ మున్సిపల్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

గంజాయి విక్రయాలపై ఉక్కుపాదం

- చిత్తూరులో రూ.1.20 లక్షలు విలువ చేసే 8 కేజీల గంజాయి పట్టివేత
- నలుగురు అరెస్ట్

చిత్తూరు అర్బన్: చిత్తూరు నగరంలో పోలీసులు గంజాయి విక్రయాలపై ఉక్కుపాదం మోపుతున్నారు. తాజాగా చిత్తూరు టూటౌన్ పోలీసులు సుమారు రూ.1.20 లక్షలు విలువ చేసే 8 కేజీల గంజాయిని స్వాధీనం చేసుకున్న ఘటన వెలుగు చూసింది. వివరాలు ఇలా.. సీఐ నెట్టికంఠయ్య తన బృందంతో ఇరువారం ప్రాంతంలో గంజాయి విక్రయాలపై దాడులు నిర్వహించారు. ఈ దాడిలో నలుగురు వ్యక్తులు పట్టుబడగా వారి నుంచి రూ.1.20 లక్షలు విలువజేసే 8 కేజీల వరకు గంజాయి స్వాధీనం చేసుకున్నారు. వైజాగ్ రైల్వేస్టేషన్ వద్ద గుర్తు తెలియని వ్యక్తుల ద్వారా వీరు గంజాయి అక్రమ రవాణా చేస్తున్నట్లు గుర్తించారు. అలాగే బంగారుపాళ్యం మండలం చీకురుపల్లికి చెందిన వాసు అనే వ్యక్తితో కలిసి గంజాయి అక్రమ రవాణా చేస్తున్నట్లు విచారణలో తేలింది. వీరు చిత్తూరులో గంజాయిని చిన్నచిన్న ప్యాకెట్లుగా తయారు చేసి అధిక ధరలకు విక్రయిస్తున్నట్లు గుర్తించారు. పట్టుబడిన వారిలో సంతపేటకు చెందిన అమర్‌నాథ్ (37), దేవేంద్ర (48), ఎంజీఆర్ వీధికి చెందిన లోకేష్ (25), కార్తీక్ (20)పై కేసు నమోదు చేసి అరెస్ట్ చూపించి రిమాండ్‌కు తరలించారు. చీకుపల్లి వాసు పరారీలో ఉన్నట్లు పోలీసులు తెలిపారు. ఎస్ఐ ప్రసాద్, కానిస్టేబుల్ పరాందామ తదితరులు ఉన్నారు.

బస్సులో పరిచయం.. కట్ చేస్తే..

- రిటైర్డు ఆర్మీ ఉద్యోగి ఇంటికి వచ్చిన మోసగాడు
- మాటల్లో దింపి పాలలో మత్తు మందు కలిపిచ్చిన వైనం
- ఆపై బాధితులను కట్టేసి బంగారు, సెల్‌ఫోన్ చోరీ

గుడిపాల: బస్సులో పరిచయమైన వ్యక్తిని నమ్మి ఇంటికి ఆహ్వానించి భోజనం పెట్టిన వారికే.. ఓ వ్యక్తి కన్నం పెట్టిన ఘటన గుడిపాలలో వెలుగు చూసింది. ఎస్ఐ రామ్మోహన్‌రెడ్డి తెలిపిన వివరాల మేరకు.. మండంలోని పాపసముద్రం గ్రామానికి చెందిన ఆర్మీలో పని చేసి రిటైర్డు అయిన సుబ్రమణ్యంరెడ్డి అలియాస్ మణి(78) భార్యతో కలిసి నివసిస్తున్నాడు. నవంబర్‌లో చిత్తూరు నుంచి వేలూరుకు వెళ్తున్న బస్సులో వెళ్తుండగా సుబ్రమణ్యంరెడ్డికి ఓ వ్యక్తి పరిచయమయ్యాడు. అది కాస్త సన్నిహితంగా మారడంతో ఈ నెల 17వ తేదీన ఆ వ్యక్తి సుబ్రమణ్యంరెడ్డి ఇంటికి వచ్చాడు. వారి ఇంట్లోనే రాత్రి భోజనం చేశాడు. అనంతరం ఇక్కడే పడుకోవాలని సుబ్రమణ్యంరెడ్డి అతన్ని కోరడంతో ఉండిపోయాడు. రాత్రి 11 గంటల సమయంలో ఆ వ్యక్తి వాళ్లను మాటల్లోకి దింపి మత్తు మందు కలిపిన పాలను తాగించాడు. అనంతరం వారిని తాడుతో కట్టేసి కత్తితో బెదిరించి ఇంట్లో ఉన్న 114 గ్రాముల బంగారుతో పాటు సుబ్రమణ్యంరెడ్డి సెల్‌ఫోన్, బైక్‌ను తీసుకుని వెళ్లిపోయాడు. అయితే బైక్‌ను గుడిపాల క్రాస్‌లో వదిలేసి వెళ్లాడు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని ఎస్ఐ తెలిపారు. త్వరలోనే నిందితున్ని పట్టుకుంటామన్నారు.

యువకుడిని రాళ్లతో కొట్టి చంపి..

- 20 రోజుల తరువాత వెలుగులోకి ఘటన
- కన్నతండ్రిపై అనుమానాలు
- త్వరలోనే వాస్తవాలు తేలుస్తాం: సీఐ శ్రీనివాసులు

పుంగనూరు: ఓ యువకున్ని 20 రోజుల కిందట పుంగనూరు మండల పరిధిలో రాళ్లతో కొట్టి చంపేసిన సంఘటన ఆలస్యంగా వెలుగుచూసింది. శనివారం పుంగనూరు సీఐ శ్రీనివాసులు తెలిపిన మేరకు వివరాలిలా.. 20 రోజుల కిందట గుర్తు తెలియని వ్యక్తులు చిత్తూరు జిల్లా పుంగనూరు మండలం బోయకొండ సమీపంలోని అటవీ ప్రాంతంలోకి ఒక వ్యక్తిని తీసుకొచ్చి రాళ్లతో కొట్టి చంపేసి వెళ్లిపోయారు. శుక్రవారం రాత్రి దీన్ని గమనించిన ఆ ప్రాంత వాసులు పోలీసులకు ఫిర్యాదు చేయడంతో వారు ఘటనా స్థలాన్ని సందర్శించి, కేసు నమోదు చేశారు. హతుడి వద్ద దొరికిన సమాచారం ఆధారంగా మదనపల్లె రూరల్ మండలం మమ్మిడిగుండ్లపల్లెకి చెందిన గంగుల రెడ్డి కుమారుడు సోమశేఖర్‌రెడ్డిగా నిర్ధారించారు. శవం పూర్తిగా గుర్తు పట్టలేని విధంగా మారిపోయింది. మెడికల్ ఆఫీసర్ డాక్టర్ మధుసూదనాచారి ఆధ్వర్యంలో అక్కడే పోస్టుమార్టం చేశారు. ఈ మేరకు దర్యాప్తులో హత్యగా నిర్ధారించారు. దీనిపై సీఐ మాట్లాడుతూ యువకుడి హత్యకేసులో పలురకాల అనుమానాలు ఉన్నాయని, హతుడి తండ్రిపై కూడా ఆరోపణలు ఉన్నాయన్నారు. దర్యాప్తులో వాస్తవాలు తేలాల్సి ఉందని, త్వరలోనే హంతకులను పట్టుకుంటామని స్పష్టం చేశారు. కాగా సోమశేఖర్‌రెడ్డిపై భార్యాబిడ్డలు మృతి చెందిన కేసులో మదనపల్లె పోలీసులు కేసు నమోదు చేసి ఉన్నారని తెలిపారు.

రైతులకు టోకరా

- ఈఎంఐలు కడతాం.. బాడుగ ఇస్తాం అని నమ్మిస్తూ మోసం
- ముగ్గురు నిందితుల అరెస్టు
- రూ.20 లక్షలు విలువజేసే ట్రాక్టర్ల రికవరీ



నిందితుల అరెస్టు చూపుతున్న సీఐ హనుమంతప్ప

కార్వేటినగరం: రైతులను మోసం చేసిన నిందితులను కార్వేటినగరం సీఐ హనుమంతప్ప అరెస్టు చేశారు. వివరాలు.. గుండ్రాజుఇండ్లు గ్రామానికి చెందిన మురళి అనే వ్యక్తి ట్రాక్టర్లు ఇప్పిస్తామని.. ట్రాక్టర్లు ఉంటే వాటిని బాడుగకు పెట్టుకుని, డబ్బులు ఇస్తామని చెప్పడం.. అలాగే ట్రాక్టర్ల నెలవారీ ఈఎంఐలను కూడా తానే కడతానని చెప్పి రైతుల నుంచి ట్రాక్టర్లను తీసుకుని మోసం చేశాడు. అలాగే ఇదే మండలానికి చెందిన ఏకాంబరం అలియాస్. చిన్న, శంకర్‌కు కూడా ఇతను పలువురు రైతుల నుంచి ట్రాక్టర్లు ఇప్పించాడు. వీరు మురళితో కలిసి ఈఎంఐలు చెల్లించకుండా, రైతులకు ట్రాక్టర్లు, బాడుగలు ఇవ్వకుండా మోసం చేస్తూ వచ్చారు. దీనిపై రైతులు పోలీసులకు ఫిర్యాదు చేయడంతో సీఐ హనుమంతప్ప కేసు నమోదు దర్యాప్తు చేపట్టారు. శనివారం నిందితులు మురళి, ఏకాంబరం, శంకర్‌ను అరెస్టు చేసి, రిమాండ్‌కు తరలించినట్లు సీఐ తెలిపారు. అలాగే వారి వద్ద నుంచి సుమారు రూ.20 లక్షలు విలువ జేసే నాలుగు ట్రాక్టర్లను రికవరీ చేసి యజమానులకు అప్పగించారు. ఎవరైనా ఈఎంఐలు కడతామని, బాడుగలు ఇస్తామని చెప్పి మోసం చేసేందుకు ఎవరైనా యత్నిస్తే పోలీసులకు సమాచారం అందించాలని తెలిపారు. కార్యక్రమంలో ఎస్ఐ రాజ్ కుమార్, సిబ్బంది పాల్గొన్నారు. కేసును ఛేదించడంలో ప్రత్యేక చొరవ చూపిన కానిస్టేబుల్ రాజశేఖర్, హోంగార్డు యువరాజును అభినందించారు.

24వ తేదీలోపు ఓటరు క్లెయిమ్స్ పరిష్కారం



మాట్లాడుతున్న డీఆర్వో మోహన్‌కుమార్

చిత్తూరు కలెక్టరేట్ : జిల్లావ్యాప్తంగా ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల్లో ఈ నెల 24వ తేదీలోపు ఓటర్ల క్లెయిమ్స్ పరిష్కారం చేయనున్నట్లు డీఆర్‌ఓ మోహన్‌కుమార్ తెలిపారు. ఈ మేరకు శనివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. జిల్లాలో ఓటరు జాబితా ప్రత్యేక సంక్షిప్త సవరణ ప్రక్రియను పకడ్బందీగా చేపడుతున్నట్లు తెలిపారు. ఈ ప్రక్రియలో మొత్తం 1,32,000 క్లెయిమ్స్ అందగా, వివిధ కారణాలతో 40,107 తిరస్కరించగా, 92,117 క్లెయిమ్స్‌ను ఆమోదించినట్లు తెలిపారు. పెండింగ్‌లో ఉన్న క్లెయిమ్స్‌ను గడువు తేదీ లోపు పరిష్కరిస్తామన్నారు. జిల్లా వ్యాప్తంగా విభిన్నప్రతిభావంతులు, వయోవృద్ధుల ఉపకరణాల పంపిణీ శిబిరాలు పకడ్బందీగా నిర్వహిస్తున్నామని తెలిపారు. ఇప్పటి వరకు ఐదు శిబిరాలు పూర్తి కాగా, 2500 మంది వివిధ ఉపకరణాలకు తమ పేర్లను నమోదు చేసుకున్నట్లు చెప్పారు. ఈ నెల 24వ తేదీన సదస్సులు ముగుస్తాయన్నారు. రెండు నెలల్లో ఉపకరణాలను సమకూర్చిన అనంతరం మరోమారు శిబిరాలు నిర్వహించి ప్రస్తుతం దరఖాస్తు చేసుకుని అర్హత పొందిన వారికి వాటిని ఉచితంగా అందజేస్తామన్నారు. ఈ అవకాశాన్ని జిల్లాలోని అర్హులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. జిల్లావ్యాప్తంగా ఇప్పటి వరకు 422 గ్రామాల్లో రెవెన్యూ సదస్సులు పూర్తయినట్లు తెలిపారు. నిర్ణీత షెడ్యూల్‌లోపు రెవెన్యూ సదస్సులు పూర్తి చేసి అందిన వినతులన్నింటినీ పరిష్కరించేలా చర్యలు చేపడుతున్నట్లు డీఆర్‌ఓ వివరించారు.

కూటమి ప్రభుత్వానికి సమస్యలు పట్టవా?



ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు విడుదల చేయాలని ధర్నా చేస్తున్న ఏఐఎస్ఎఫ్ నాయకులు

చిత్తూరు కలెక్టరేట్ : గత సార్వత్రిక ఎన్నికల్లో విద్యాభివృద్ధికి కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీలను వెంటనే నెరవేర్చాలని ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర సహాయ కార్యదర్శి బండి చలపతి డిమాండ్ చేశారు. చిత్తూరు జిల్లా కేంద్రంలోని గాంధీ విగ్రహం వద్ద శనివారం ఆ సంఘం నాయకులు ధర్నా చేశారు. ఆయన మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్ నిధులు రూ.3,580 కోట్లు వెంటనే మంజూరు చేయాలన్నారు. కూటమి ప్రభుత్వానికి క్షేత్రస్థాయిలో విద్యార్థుల సమస్యలు కనిపించవా ? అని ప్రశ్నించారు. జీఓ నంబర్ 77 రద్దు చేస్తామని యువగళం పాదయాత్రలో నారా లోకేష్ ఇచ్చిన హామీని వెంటనే అమలు చేయాలన్నారు. యూనివర్సిటీల్లో ఖాళీగా ఉన్న బ్యాక్‌లాగ్, ప్రొఫెసర్ పోస్టులను వెంటనే భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. ఉన్నతవిద్య చదివే విద్యార్థులకు గతంలో నాలుగు విడతల్లో మంజూరు చేసే వారన్నారు. చాలా కళాశాలల్లో ఫీజులు చెల్లిస్తేనే పరీక్షలకు అనుమతిస్తామని డిగ్రీ, ఇంజినీరింగ్ కళాశాలల్లో ఇబ్బందులకు గురి చేస్తున్నారన్నారు. ఏఐఎస్ఎఫ్ జిల్లా కన్వీనర్ ప్రవీణ్‌కుమార్ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీలను నెరవేర్చకపోతే పెద్దఎత్తున ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. ధర్నాలో సంఘ నాయకులు మున్నా, భరత్ తదితరులు పాల్గొన్నారు.

హోరాహోరీగా ఖోఖో పోటీలు



క్రీడాకారులను పరిచయం చేసుకొంటున్న ప్రిన్సిపల్ చంద్రమౌళి

- సెమీస్‌కు చేరిన బాలికల చిత్తూరు, అనంతపురం జట్లు
- బాలుర విభాగంలో ప్రకాశం, విశాఖ, శ్రీకాకుళం, చిత్తూరు జట్లు

పుత్తూరు: స్థానిక ఎస్ఆర్ఎస్ ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో గత రెండు రోజులుగా జరుగుతున్న అండర్-19 రాష్ట్రస్థాయి ఖోఖో పోటీలు హోరాహోరీగా జరుగుతున్నాయి. శనివారం జరిగిన క్వార్టర్ ఫైనల్స్ పోటీలను డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ బి.చంద్రమౌళి ప్రారంభించారు. ఈ పోటీల్లో చిత్తూరు జిల్లా బాలికల జట్టు శ్రీకాకుళం జట్టును 11-2 స్కోర్‌తో ఓడించి సెమీస్‌కు చేరుకుంది. అలాగే మరో మ్యాచ్‌లో అనంతపురం జిల్లా జట్టు కడప జట్టుపై 11-1 స్కోర్‌తో గెలుపొంది సెమీస్ బెర్త్ ఖాయం చేసుకుంది. బాలుర విభాగంలో ప్రకాశం జిల్లా జట్టు నెల్లూరు జట్టుపై 14-2 స్కోర్‌తో గెలుపొందగా, మరో మ్యాచ్‌లో విశాఖ జిల్లా జట్టు అనంతపురం జట్టుపై 16-4 స్కోర్‌తో గెలిచి సెమీస్‌కు సిద్ధమయ్యాయి. ఉత్కంఠభరితంగా జరిగిన చివరి రెండు క్వార్టర్ ఫైనల్స్‌లో శ్రీకాకుళం జట్టు కడప జట్టుపై 8-7 స్కోర్‌తో, అలాగే చిత్తూరు జట్టు విజయనగరం జట్టుపై 10-9 స్కోర్‌తో గెలిచి రెండో సెమీ ఫైనల్స్ బెర్తులు ఖాయం చేసుకున్నాయి. ఆదివారం జరగనున్న ఫైనల్స్ మరింత ఉత్కంఠభరితంగా జరుగుతాయని నిర్వాహకులు తెలిపారు. పోటీలను ఎస్‌జీఎస్ సెక్రటరీ జయరామయ్య, రాష్ట్ర పరిశీలకులు ఈశ్వర్‌నాయక్, క్రీడా సంఘాల నాయకులు బాబు, శరత్, బాలాజీ, సుబ్రమణ్యంరెడ్డి, పీడీలు పర్యవేక్షించారు.